క్లుప్తంగా

ఆహార సరఫరాకు టెండర్ల ఆహ్వానం

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులు, విధి నిర్వహణలో ఉన్న డాక్టర్లకు ఆహార (డైట్) సరఫరాకు సీల్డు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 30 పడకల ఆస్పత్రికి గాను డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, అనంతపురం పేర రూ.1000 డీడీ తీసి వచ్చేనెల 6లోపు టెండర్లు సమర్పించాలన్నారు. అదనపు సమాచారం కోసం 8008553730, 8247578680 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిద్దాం



మాట్లాడుతున్న కమిషనర్ నయీమ్

గుంతకల్లుటౌన్: పర్యావరణానికి హాని తలపెట్టే సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వినియోగాన్ని ప్రజలు పూర్తిగా నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించాల్సిన జనపనారతో తయారుచేసిన చేతి సంచుల ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం మార్కెట్ రోడ్డులో ఏర్పాటు చేశారు. జనపనారతో తయారుచేసిన సంచులు బలమైన, మన్నికమైనవని, వాటి వాడకం వల్ల పర్యావరణానికి ఎటువంటి హాని జరగదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సామాజిక వేత్త ఇల్లూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితా విడుదల

పుట్లూరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన అర్హుల జాబితాను పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచినట్లు ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి శుక్రవారం తెలిపారు. 6వ తరగతి ప్రవేశం కోసం 118 మంది దరఖాస్తు చేసుకోగా 64 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు/గుంతకల్లు టౌన్: పట్టణంలోని రామిరెడ్డి కాలనీలో స్త్రీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన, ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల పలు అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. సైబర్ నేరాల్లో భాగంగా సెల్ ఫోన్లకు వచ్చే లింక్‌లు ఓపెన్ చేయడం వల్ల జరిగే ఆర్థిక నష్టాలపై వివరించారు. అదేవిధంగా విద్య, బాలల హక్కులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై కాలనీ వాసులకు తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, మహిళా పోలీసు మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డీఎస్ పట్టణ కమిటీ ఎంపిక

గుంతకల్లు: రాయలసీమ దళిత సంఘం (ఆర్‌డీఎస్) గుంతకల్లు పట్టణ కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బండారి సురేంద్రబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మణిశంకర్, నెట్టికంటి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా సర్వాల పవన్‌కుమార్, కోశాధికారిగా ఎం.కళ్యాణ్‌కుమార్, సభ్యులను ఎన్నుకున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అణగారిన వర్గాల అభ్యున్నతికి, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాటాలు చేస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు తెలిపారు.

సైబర్ నేరాల కట్టడిపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏషియన్ ఫౌండేషన్ సభ్యులు

యాడికి: ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఏషియన్ ఫౌండేషన్ జిల్లా సభ్యులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని విజన్‌స్కూల్‌లో ఏషియన్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు బాబు, జిల్లా ట్రైనర్ రమేష్‌బాబు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ఫోన్లో ఎవరైనా బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. ఫోన్, మెయిల్, ద్వారా వచ్చే వెబ్‌సైట్‌లను ఓపెన్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో పీపుల్స్ హ్యూమన్ రైట్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ నారాయణస్వామి, విశ్వనాథ్, లక్ష్మీనారాయణ, సుధాకర్, చంద్రశేఖర్, శివకోటి, మురళి, తిరుమలేశ్, ప్రసాద్, రవి చలమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంపు.. కంపు

భక్తుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు



పెద్దపప్పూరు: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు కంపుకొడుతున్నా సిబ్బంది ఏమాత్రం పట్టించుకోలేదని స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు వాపోతున్నారు. కొన్నింటికి తలుపులు దెబ్బతిన్నాయని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టకపోవడంతో బహిర్భూమి కోసం ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని మహిళలు వాపోయారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..



ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణ పనులు



భవనం లోపల మద్యం సీసాలు పడేసిన దృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లిలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గత ప్రభుత్వం పేద ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గరగా ఉండాలనే ఉద్దేశ్యంతో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చింది. ఇందులో భాగంగా అధికారులు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టారు. కాశేపల్లి సమీపంలో అధికారులు గ్రంథాలయ భవనం, పాల డెయిరీ భవనాలను నిర్మించడానికి చర్యలు చేపట్టారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ప్రభుత్వం మారడంతో ఆ భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో ఆకతాయిలు, మందుబాబులు వాటిని అడ్డాగా చేసుకున్నారు. అటుగా వెళ్లిన వారు వారిని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాల్లో అసాంఘిక కార్యాకలాపాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

పేరుకున్న అపరిశుభ్రత

మద్యంషాపు వద్ద చెత్త కుప్ప



తాడిపత్రి రూరల్: పరిశుభ్రతలో ఎన్నో అవార్డులు, రివార్డులను సొంతం చేసుకున్న తాడిపత్రి మునిసిపాలిటీలో ఎక్కడ చూసినా చెత్త చెదారం కనిపించడంపై 'ఇదేనా క్లీన్ తాడిపత్రి' అంటూ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. మద్యం షాపుల వద్ద కుప్పలు కుప్పలుగా చెత్త చెదారం ఉంటున్నా మునిసిపల్ అధికా రులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై చెత్తా చెదా రం వేసిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానాలు విధిస్తామని చెపుతున్న మునిసిపల్ అధికారులు దీనిపై ఏం సమాధానం చెపుతారో చూడాలి.

వైభవంగా వెంకన్నకు పూజలు



అలంకరణలో వేంకటేశ్వరస్వామి



కేతిరెడ్డిని సన్మానిస్తున్న శంకరనారాయణ



పూజల్లో పాల్గొన్న కేతిరెడ్డి రమాదేవి, కుటుంబ సభ్యులు

యల్లనూరు: డప్పు వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, ప్రాతఃకాల పూజ, దీక్షా హోమం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు లక్ష్మీనారయణశర్మ, శేషగిరి శర్మ నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, భార్య రమాదేవి, కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి, కోడళ్లు హాజరై పూజలు చేశారు. అనంతరం వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను పురవీధుల్లో ఊరేగించారు. మూల విరాట్‌కు గ్రామస్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కట్టెల కోలాటం, శ్రీనివాస కళ్యాణం వివిధ రకాల దేవతామూర్తుల వేషధారణలో నృత్యరూపకం ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. అలాగే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆహ్వానం మేరకు మాజీ మంత్రి శంకరనారాయణ హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు ఇలా..

ఉదయం స్వామి వారికి ప్రాతఃకాల పూజ, యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, ప్రతిష్ఠ హోమాలు, మహా కుంభాభిషేకం పూజలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఉదయం రాతిదూలం లాగుడు పోటీలను తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభిస్తారన్నారు. అనంతరం కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం కుమారులు కేతిరెడ్డి వెంకటనాగిరెడ్డి, కేతిరెడ్డి వెంకట మోహన్‌రెడ్డి (వైఎస్సార్ హాస్పిటల్ అధినేత) ప్రతిభ చూపిన వృషభాల యజమానులకు బహుమతులను ప్రదానం చేస్తారు. రాత్రికి జబర్దస్త్ బృందంతో ఆర్కెస్ట్రా ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు.

భూ సేకరణకు అన్నదాతలు సహకరించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు: రాగులపాడు నుంచి గుంతకల్లు మండలంలోని చెరువులకు సాగునీరు మళ్లించడానికి అవసరమయ్యే భూసేకరణకు అన్నదాతలు సహకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, మండల రైతులు అభ్యర్థించారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాగులపాడు నుంచి వజ్రకరూరు, కమలపాడు, గూళ్యపాళ్యం, కొనకొండ్ల మీదుగా గుంతకల్లుకు హంద్రీనీవా సాగునీరు మళ్లించడానికి ప్రభుత్వం 215 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఈ పథకం పూర్తయితే గుంతకల్లు మండలంలోని 12 చెరువులకు, 150 చెక్ డ్యామ్‌లకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. అయితే ప్రభుత్వం అందజేసే పరిహారంపై సంబంధిత రైతులు ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో ఈ పథకం ముందుసాగడం లేదన్నారు. రైతులు పెద్దమనస్సు చేసుకుని ప్రభుత్వం అందిచే పరిహారం తీసుకుని భూసేకరణకు సహకరించాలని కోరారు. పరిహారం చెల్లించడానికి, పిల్లకాలవ ఏర్పాటుకు అవసరమయ్యే నిధులను వెంటనే విడుదల చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ ఇటీవల ప్రకటించన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతులు జయన్న, శ్రీనివాసులు, పెన్నయ్య, బాలక్రిష్ణ, పామన్న, రామాంజినేయులు, నాగేంద్ర, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రారంభం

గార్లదిన్నె/పామిడి: సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు గార్లదిన్నె ఏఓ సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది గార్లదిన్నె మండలానికి కే6 రకం 900 క్వింటాళ్లు సబ్సిడీ విత్తన కాయలు కేటాయించారన్నారు. క్వింటా పూర్తి ధర రూ.3720 కాగా 40 శాతం రాయితీతో సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు. ఒక్కో రైతుకు ఎకరాకు గరిష్టంగా 3 బస్తాలు ఇస్తామన్నారు. అలాగే పామిడి ఏఓ డీలీనా వసుంధర మాట్లాడుతూ మండలానికి కే–6 రకం 1100 క్వింటాళ్లు, టీసీజీఎస్–1694 రకం 100 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారన్నారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకొని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకొని నగదు చెల్లిస్తే విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు.

'ముసలమ్మ' స్థలాన్ని కాపాడుకుంటాం



ముసలమ్మ ఆలయం ఎదుట ఆందోళన చేస్తున్న భక్తులు, గ్రామస్తులు

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల కేంద్రంలోని గ్రామ దేవత ముసలమ్మ తల్లి దేవాలయం స్థలాన్ని ఐకమత్యంగా కాపాడుకుంటామని గ్రామస్తులు, భక్తులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముసలమ్మ ఆలయం ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వం వరదలు వచ్చి బీకేఎస్ చెరువు తెగినప్పుడు ముసలమ్మ ప్రాణత్యాగం చేసిందన్నారు. అప్పటి నుంచి గ్రామాన్ని రక్షిస్తూ వస్తున్న ముసలమ్మ తల్లి ఆలయానికి భద్రత లేకుండా పోయిందన్నారు. కొంత మంది నకిలీ పట్టాలు సృష్టించి ముసలమ్మ ఆలయ స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారన్నారు. అమ్మవారి స్థలాన్ని కాపాడేందుకు గ్రామస్తులంతా ఏకమై పరి రక్షించుకుంటామన్నారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామన్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుశీలమ్మ, సూర్యనారాయణరెడ్డి, ఎస్.నారాయణస్వామి, సాకే రామక్రిష్ణ, నందినేని మల్లికార్జున, పురుషోత్తం, చికెన్ నారాయణస్వామి, శేషానందరెడ్డి, సురేష్, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం, మతోన్మాదాన్ని ఐక్యంగా ఎదుర్కొందాం



మాట్లాడుతున్న సీపీఎం నేత రాంభూపాల్

గుంతకల్లుటౌన్: దేశంలో ఉగ్రవాదాన్ని, మతోన్మాదాన్ని ఐక్యంగా ఎదుర్కొని లౌకికత్వం, మతసామరస్యాన్ని కాపాడుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో 'పెహల్గామ్ ఉగ్రదాడి–అనంతరం పరిణామాలు' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన రాంభూపాల్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడితో దేశవ్యాప్తంగా సమైక్యతాభావం వెల్లివిరిసిందన్నారు. కాల్పుల విరమణ అనంతరం జరిగిన సంఘటనలు మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయన్నారు. ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోయడం దుర్మార్గమన్నారు. మైనార్టీలపై దాడులు జరుగుతున్నా వాటిని ఆపాల్సిన కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి సర్కారు చోద్యం చూడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.కె.నాయుడు, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి, ప్రజా సంఘాల నేతలు తారకేష్, ఆదినారాయణ, వై.శ్రీనివాసులు, ఆయా పార్టీల అనుబంధ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



రేష్మాకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న వీసీ సుదర్శన్ రావు



హాజరైన పట్టభద్రులు

గుత్తి: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శన్‌రావు సూచించారు. గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి అవసరమైయ్యే పరిశోధనలు చేయాలన్నారు. ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలన్నారు. ప్రొఫెసర్ వైశాలి గోర్పడే మాట్లాడుతూ పట్టభద్రులు అంకిత భావంతో పని చేయాలన్నారు. అనంతరం ఎంబీఏ, ఎంసీఏలో టాపర్లుగా నిలిచిన షేక్ రేష్మా, షేక్ ఆరిఫా బేగంకు వైస్ చాన్సలర్ గోల్డ్ మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో గేట్స్ ఎండీ రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



పుట్లూరు మండలం శనగలగూడూరులో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు



గుత్తి మండలం తొండపాడులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధారాణి

పుట్లూరు: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని శనగలగూడూరు, పుట్లూరు గ్రామాల్లో శుక్రవారం వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్వర్యంలో పని చేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) రెడ్డిపల్లి శాస్త్రవేత్తల బృందం హాజరై రైతులకు పలు సూచనలు అందించారు. ఉద్యానవన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.సుబ్రమణ్యం పండ్లతోటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఐఐజీఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న పప్పుశనగ, కంది తదితర పంటల సాగుపై సలహాలిచ్చారు. అలాగే కేవీకేకు చెందిన చందన డ్రోన్‌ల ద్వారా మందుల పిచికారీ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కాత్యాయని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైవిధ్య పంటలు సాగు చేయండి

గుత్తి రూరల్: రైతులు ఏక పంట విధానానికి స్వస్తి పలికి వైవిధ్య పంటలను సాగు చేయాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి సూచించారు. మండలంలోని తొండపాడు, వన్నేదొడ్డి గ్రామాల్లో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి రైతులకు పంటల సాగు, డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్ పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాస్త్రవేత్త మాట్లాడుతూ పంటల సాగులో రైతులు అనువైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. అనంతరం భూసార పరీక్షల ఫలితాల పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో రేకులకుంట శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మన్న, డాక్టర్ వై.రమణ, గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు, వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, హెచ్ఓ మిత్రవిందమాధవి, పశువైద్యుడు ప్రదీప్, ఆత్మ బీటీఎం లావణ్య, రైతులు రంగయ్య, పురుషోత్తం యాదవ్ పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

బుక్కరాయసముద్రం: గొర్రెలు, మేకలు పెంపకంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ వెంకటేశ్వర పశు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర పశు పరిశోధనా కేంద్రంలో సౌత్ జోనల్ ఫీల్డ్ రెప్రజెంటేటివ్స్ వీర్ బాక్ అనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చరిత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ చేతన్, డాక్టర్ రఘుకరణ్, దిలీప్‌కుమార్, ఓం ప్రకాష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని పి.వీరన్నపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రవి అనే వ్యక్తి ని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మట్కా బీటర్

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లులో మట్కాబీటర్ పక్రుద్దీన్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. అతడి నుంచి రూ.12,150, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని తాడిపత్రి కోర్టులో హాజరు పరచామన్నారు.

'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుంతకల్లుటౌన్/గార్లదిన్నె: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ నయీమ్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆయన యోగాసనాలు చేశారు. అలాగే గార్లదిన్నెలోని టీ కన్వెన్షన్ హాల్లో గ్రామ సచివాలయ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులకు మూడో రోజు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, శిక్షకులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన నవ అహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లుటౌన్/గుత్తి: గుంతకల్లు పట్టణంలోని ఆలూరు రోడ్డు విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ పతాకాన్ని సీనియర్ నాయకుడు ఎస్.కె.ఎం.బాషా ఎగురవేసి వందనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగరాజు, విద్యుత్ కార్మికుల సంఘం నాయకులు తేజ్, నూరి, హుసేన్‌పీరా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.అలాగే గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, నిర్మల, సీనియర్ నాయకుడు వెంకటేష్ సీఐటీయూ జెండా ఆవిష్కరించారు.

అధికారులకు సత్కారం

పామిడి: మండలంలోని తహసీల్దార్ ఎస్.శ్రీధర మూర్తి, ఎంపీడీఓ కే తేజోత్స్న, సీఐ వీ యుగంధర్, ఈఓ ఎం.గోపాల్‌ను శుక్రవారం స్వరరాగ నాటక కళాసమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సృజనాత్మక ప్రభుత్వ తెలుగు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిరుపేద కళాకారుల సహాయార్థం పామిడితో పాటు గుత్తి, గార్లదిన్నె మండలాల ప్రాంతాల్లో నిర్వహించిన 15 నాటక ప్రదర్శనకు సహాయ సహకారాలు అందించిన సందర్భంగా ఆ కళాసమితి వారు మండల అధికారులకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. నాటక సమితి సభ్యులు, వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరాజు, గౌరవ అధ్యక్షుడు పుంజా కృష్ణారావు యాదవ్, బెస్త సుబ్రమణ్యం, నారాయణరెడ్డి, నాగార్జున, ఆంథోని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సివిల్ రైట్స్ డే

గుత్తి రూరల్/పెద్దవడుగూరు/గార్లదిన్నె: గుత్తి మండలంలోని ఊబిచెర్ల దళిత కాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, తహసీల్దార్ ఓబిలేసు కాలనీ వాసులతో సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ కలిసి మెలిసి జీవించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే పెద్దవడుగూరులో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో తహసీల్దార్ ఉషారాణి, ఎస్ఐ ఆంజనేయుల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అదేవిధంగా గార్లదిన్నె మండలంలోని పాత కల్లూరు ఎస్సీకాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో తహసీల్దార్ ఈరమ్మ, అధికారులు పాల్గొన్నారు.

98 మందికి ఉద్యోగావకాశాలు



నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 98 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగానికి అర్హత సాధించినట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి, కరస్పాండెంట్ తెలిపారు. 13 కంపెనీలకు చెందిన హెచ్ఆర్ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలు నిర్వహించగా 264 మంది నిరుద్యోగ యువతీ,యువకులు పాల్గొన్నారు. టాటా కంపెనీలో ఉద్యోగం సాధించిన వారికి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది మహేష్, శ్రావణి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.